క్లుప్తంగా

సమయపాలన తప్పనిసరి



పాన్‌గల్: విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రార్థనకు తప్పక హాజరుకావాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, సామర్థ్యాలను పరిశీలించారు. గణితం సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మధ్యాహ్నభోజనం మెనూ ప్రకారం అందించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సమస్యల పట్టింపేది?



వనపర్తి టౌన్: యూనివర్సిటీల్లో సమస్యలు తీర్చాలని వీసీని డిమాండ్ చేస్తే విద్యార్థి పరిషత్‌పై లేనిపోని మాటలు మాట్లాడటం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జగదీశ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ఏబీవీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ యూనివర్సిటీ సమస్యలపై అధికారులకు పట్టింపు లేదా అని ప్రశ్నించారు. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యూలర్ కోర్సులుగా మార్చాలని, సెమిస్టర్ ఫీజు, కోర్సు ఫీజులు తక్కువ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ, నాయకులు కేదారనాథ్, కార్తీక్, నితిన్, మనోజ్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మదనాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం రాత్రి ఆత్మకూరు సీఐ శివకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డుల పరిశీలన, పాత కేసుల వివరాలు, శాంతిభద్రతల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు



ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నామని కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పరమేశ్వర స్వామి చెరువు వద్ద తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు చేపడుతున్నామన్నారు. వారం రోజులుగా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయని, వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించాలి

చిన్నచింతకుంట: విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతుల్లో పాఠాలు బోధించాలని ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం బండ్రపల్లిలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రేరణ ప్లాన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ సభ్యులు శాంత, చిరంజీవి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సముచిత స్థానం

అడ్డాకుల: కాంగ్రెస్ అభ్యున్నతికి అందరు కృషి చేయాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు భీమకవి వసంత అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎంపీటీసీ శకుంతల ఆధ్వర్యంలో జరిగిన మహిళా కాంగ్రెస్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌లో పార్టీలో మహిళలకు సముచిత స్థానం ఉందని.. ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అనంతరం మహిళా కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి నియామక పత్రాలను అందజేశారు. వెంకటలక్ష్మి, నవనీత, విజయలక్ష్మి, లత ఉన్నారు.



బడిబయటి పిల్లలు 145 మంది

- మధ్యలో బడి మానేసిన పిల్లల సర్వే
- బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



అన్నారంతండాలో ఇటుక బట్టీల వద్ద బడిఈడు పిల్లలతో సీఆర్పీలు (ఫైల్)

పాన్‌గల్: చదువుకోవాలన్న తపన ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితుల కారణంగా చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. కొన్ని చోట్ల పాఠశాలలు అందుబాటులో లేక బాల కార్మికులుగా మారుతున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీల పిల్లలు పని ప్రదేశాల్లోనే కాలక్షేపం చేస్తూ అక్షరాలు నేర్చుకోలేకపోతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి తిరిగి బడిబాట పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉండి చదువు మానేయడానికి గల కారణాలపై ఆరా తీసి వారి వివరాలను సేకరించారు. ఇలా మూడు మండలాల్లో 145 మంది విద్యార్థులను సర్వేలో గుర్తించినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. విద్యకు దూరమైన విద్యార్థులను గుర్తించే లక్ష్యంగా సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి సర్వేను గతేడాది డిసెంబర్ 11 నుంచి జనవరి 31వ తేదీ వరకు నిర్వహించారు.

ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు

మండలంలోని గ్రామాల్లో సర్వేలో సేకరించిన వివరాలను విద్యాశాఖ సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో కేంద్రం ఆధీనంలోని ప్రబంధ్ పోర్టల్‌లో సీఆర్పీలు నమోదు చేస్తున్నారు. సర్వేలో గుర్తించిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, వయస్సును పరిగణలోకి తీసుకుని నిర్దేశిత తరగతుల్లో చేర్పించడం, దూర విద్యలో ప్రవేశాలు కల్పించడం వంటివి చేపట్టనున్నారు. దూరవిద్యలో చదువుకుంటే సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)కింద ఏడాదికి రూ. 2 వేలు మేర ప్రోత్సాహం అందించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ప్రవేశాల ఫీజు, స్టడీ మెటీరియల్ ఇతర ఫీజుల భారం నుంచి విద్యార్థులను ఉపశమనం లభించే అవకాశం ఉంది.

మండలాల వారీగా బడిబయటి పిల్లలు

మండలం	6-14ఏళ్లు	15-19 ఏళ్లు
పాన్‌గల్	46	16
చిన్నంబావి	12	12
వీపనగండ్ల	35	24

ఇటుక బట్టీల వద్దే..

ప్రతి ఏడాది ఇటుక బట్టీల్లో పని చేసేందుకు జిల్లాకు ఒడిశా రాష్ట్రం నుంచి కార్మికుల కుటుంబాలు వస్తుంటాయి. వీరంతా మండలంలోని పలు గ్రామాల్లోని ఇటుక బట్టీల వద్ద పనులు చేస్తుంటారు. పనులు చేసే కూలీల పిల్లల కోసం అక్కడే ప్రత్యేక తరగతి గదిని ఏర్పాటు చేసి వారికి విద్య బోధన చేసేందుకు వాలంటీర్‌ను నియమించినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు.

వలస కూలీల పిల్లలకు..

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కూలీలు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేస్తే పిల్లలు చదువుకు దూరం కాకుండా ఉంటారు. సర్వే చేసిన సమయంలో మాత్రమే అధికారులు హడావిడి చేస్తారు. ఆ తర్వాత వారి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కొందరూ బాలకార్మికులుగా మారుతున్నారు.

– ఆంజనేయులు, డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు, రేమద్దుల

చైతన్యం కలిగించాలి



చదువు ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగిస్తే పిల్లలు మధ్యలో బడిమానే పరిస్థితులు కొంత వరకు తగ్గుతాయి. పాఠశాలకు వచ్చి మధ్యలో బడి మానేసే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– రాధాకృష్ణ, హెచ్‌ఎం, పీఎస్, దొండాయిపల్లి

రోజు పాఠశాలకు రావాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబయట, మధ్యలో బడిమానేసిన పిల్లల గుర్తింపు సర్వేను సీఆర్పీలు నిర్వహించారు. ఇప్పటి వరకు సర్వేలో మూడు మండలాల్లో 145 మందిని గుర్తించాం. ఇటుక బట్టీల పిల్లల కోసం పని వద్ద ప్రత్యేకంగా తరగతి గది ఏర్పాటు చేశాం. ఇంకా ఎవరైనా పిల్లలు మిగిలి ఉంటే వారిని కూడా గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తాం. పది, ఇంటర్ విద్యార్థులకు వచ్చే విద్యాసంవత్సరంలో దూర విద్యా విధానంలో ప్రవేశాలు కల్పిస్తాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా సుస్థిర అభివృద్ధి కోసం సైన్స్ అనే అంశంపై ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపన్యాసం, చిత్రలేఖనం, కవిత్వం, పాటలు మండల స్థాయి పోటీలను నిర్వహించినట్లు పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉపన్యాసం పోటీలో వినయ్‌కుమార్ (10వ తరగతి), సౌమ్య (7వ తరగతి) పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల, పాటల పోటీల్లో భానుప్రియ (8వ తరగతి) పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల, పూజ (7వ తరగతి) కేతేపల్లి ఉన్నత పాఠశాల, కవిత్వంలో అనిత (6వ తరగతి) కేతేపల్లి ఉన్నత పాఠశాల, లిఖిత (6వ తరగతి) బాలుర ఉన్నత పాఠశాల, చిత్రలేఖనంలో శ్రావణి (8వ తరగతి) కేతేపల్లి ఉన్నత పాఠశాల, హరిక (8వ తరగతి) బాలికల ఉన్నత పాఠశాల పాన్‌గల్ ప్రతిభ చూపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ఈనెల 10వ తేదీన జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



ఆత్మకూర్: మత్స్యకారులకు ప్రభుత్వం ద్వారా వలలు, బోట్లు, తెప్పలు ఇతర సామగ్రిని అందించాలని మత్స్య సహకార సంఘం రాష్ట్ర నాయకులు అశ్విన్‌కుమార్, పుట్ట బాలరాజు అన్నారు. గురువారం రామన్‌పాడ్ ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఫిషరీష్ కమిషనర్ గోపి, కలెక్టర్ తేజస్ పవార్‌ను సత్కరించి వినతిపత్రం అందజేశారు. మదనాపురం నుంచి రామన్‌పాడు మీదుగా ఆత్మకూర్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని, రామన్‌పాడు గెస్ట్ హౌస్‌కు మరమ్మతు చేపట్టాలని కోరారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ డైరక్టర్ మురళీకృష్ణ, ఏడీ రహ్మాన్, నాయకులు లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ఆత్మకూర్‌లో..



డ్రైయినేజీలో మురుగు తొలగింపు పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మహ్మద్‌ఖాజా

ఆత్మకూర్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాజు అన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆయా వార్డులను స్వచ్ఛతగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రధానంగా డ్రైయినేజీల శుభ్రతంగా చేసేందుకు శ్రీకారం చుట్టామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో గురువారం పారిశుద్ధ్య కార్మికులతో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింపు పనులు చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగుకాల్వలపై శాశ్వతంగా స్లాబ్‌లు వేసుకున్నారని, అలాంటి వారి ఇళ్ల ముందు వాటిని తొలగించి కాల్వల్లో నిల్వ ఉన్న మురుగును తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపల్ సిబ్బంది అలాంటి వాటిని గుర్తించి తొలగించక ముందే స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు కాల్వల్లోని మురుగును తొలగించేందుకు వీలు లేకుండా మురుగుకాల్వలపై బండలు వేయడం, సిమెంట్‌తో వాటిని కప్పి ఉంచడం నేరమన్నారు. పట్టణంలో తాగునీటి అవసరాలతో పాటు ఇంటి పరిసరాల పరిశుభ్రత వ్యవహారాలపై వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. దోమల వ్యాప్తి నివారణకు ఫాగింగ్ చేపడుతున్నట్లు వెల్లడించారు.

బాలిక అదృశ్యం

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రానికి చెందిన బాలిక(14) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ కె.సుజాత తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక బుధవారం జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి బయటకు వెళ్లిందని వివరించారు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో బాలిక తల్లి గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జీల్దార్‌తిప్ప చెరువుకు సాగునీరివ్వాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం, మొలచింతలపల్లి సమీపంలో ఉన్న జీల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముక్కిడిగుండంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా జిల్లాకు సాగునీరు అందిస్తామని మాటలు చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో పెట్టడం లేదన్నారు. ఖరీఫ్ నాటికి ముక్కిడిగుండం, మొలచింతలపల్లికి సాగునీరు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రిక విడుదల

అయిజ: మండల కేంద్రంలో పునర్ నిర్మించిన గుంతరామలింగేశ్వర స్వామి ఆలయంలో త్వరలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం ఆలయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు రఘుస్వామి మాట్లాడారు. ఈనెల 12 నుంచి 14 వరకు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్న ప్రతిష్ఠ కార్యక్రమం మంత్రాలయం పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థులు చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు పేర్కొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



అమ్మవారి మూల విగ్రహం

పెబ్బేరు రూరల్: భక్తుల కొంగు బంగారంగా పిలుచుకునే చౌడేశ్వరి దేవి ఉత్సవాలు శుక్రవారం నుంచి మండల కేంద్రంలో ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ పాడ్యమి రోజు ఈ ఉత్సవాలను జరపడం ఆనవాయితీగా వస్తోంది. యాదవుల ఇలవేల్పుగా పిలుచుకునే చౌడేశ్వరి ఉత్సవాలు వేణుగోపాలస్వామి ఊరేగింపుతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. జాతర కోసం స్థానిక సుభాష్‌చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డుకు ఇరువైపులా వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా మండల కేంద్రంలో ఎగ్జిబిషన్ జరుగుతుంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పెబ్బేరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జరిగే వేణుగోపాలస్వామి ఊరేగింపుతో ప్రారంభమవుతుంది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు చౌడేశ్వరి దేవి గంగస్నానం, రాత్రి 11.30 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు అమ్మవారి పల్లకీ సేవ, జ్యోతుల ఊరేగింపు జరుగుతుంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం రాత్రి 8 గంటల వరకు భక్తుల సందర్శనార్థం అమ్మవారిని చిన్న చౌడేశ్వరి ఆలయంలో ఉంచుతారు. స్థానిక రైతు సంఘం భవనం వద్ద నాటికలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో పాటు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు, చెక్క భజన, బొడ్డెమ్మ తదితర పోటీలను ఏర్పాటు చేస్తారు.

మీటర్ రీడింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ సబ్ డివిజన్‌లో 15ఏళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడింగ్ కార్మికులకు నెలనెల జీతాలు ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు లింగంశేఖర్, నవీన్‌కుమార్ కోరారు. పెద్దకొత్తపల్లి సబ్ స్టేషన్‌లో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15ఏళ్లుగా విద్యుత్ శాఖలో పని చేస్తూ ప్రతి నెల ఇంటింటికీ తిరుగుతూ మీటర్ బిల్లు రీడింగ్ తీసి వినియోగదారులకు అందజేస్తున్నా తమకు కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్ రీడింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు కేవలం కమీషన్ మాత్రమే చెల్లిస్తున్నారు. మాకు కనీస వేతనం చెల్లించి ఆర్టిజన్‌లుగా గుర్తించాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నవీన్,లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: క్రీడలతోనే యువతలో మానసికోల్లాసం ఏర్పడుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. చౌడేశ్వరి జాతర సందర్భంగా పట్టణంలోని ఆజాద్, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీపీఎల్–14 క్రికెట్ పోటీలను ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీతో కలిసి గురువారం ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సహకారంతో పట్టణానికి గ్రౌండ్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి పరిచే బాధ్యత మున్సిపల్ పాలక వర్గం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కర్రెస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథంనాయుడు, కౌన్సిలర్ అక్కమ్మ, పద్మ, సుమతి, పార్వతమ్మ, ఎల్లారెడ్డి, రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు గౌని బుచ్చారెడ్డి, వనం రాములుయాదవ్, దిలీప్‌రెడ్డి, సాయినాథ్, మేకల ఎల్లయ్య, రాజశేఖర్, గోల్డ్ బాలస్వామి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు రవాణా రంగాన్ని ఆదుకోవాలి



వీపనగండ్లలో..



రేమద్దులలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: రోడ్డు రవాణా రంగాన్ని రక్షిస్తూ కార్మికులకు సామాజిక భద్రత చట్టాన్ని రూపొందించాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకిషన్ అన్నారు. గురువారం మండలంలోని రేమద్దులలో ప్రైవేట్ ట్రాలీ ఓనర్స్, ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మె వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో రోడ్డు రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత బస్సుతో నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్‌ను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, ఆంజనేయులు, నిరంజన్, మల్లేష్, మహేష్, కేవీపీఎస్ నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగడదాం

వీపనగండ్ల: రైతులు, కార్మికులు ప్రజాప్రతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ఈనెల 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మురళి, ఈశ్వర్, రామన్‌గౌడ్, రామకృష్ణ, నవీన్, వెంకటేశ్వర్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమలపై కోట్లాది మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, పరిశ్రమలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లాకార్యదర్శి హన్మంతు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఈనెల16న దేశ వ్యప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, ప్రసాద్, రాబర్ట్, వెంకటయ్య, అంజి, కార్మికులు పాల్గొన్నారు.

రాజభవనం పరిరక్షణకు నిధులు కేటాయించాలి



రాజభవనాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు

పెబ్బేరు రూరల్: జిల్లా కేంద్రంలోని రాజభవనం పరిరక్షణకు, పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టళ్లను నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ కోరారు. గురువారం ఆయన అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం గతంలో రూ.22 కోట్ల నిధులను మంజూరు చేసినా.. ఇంకా పనులు ప్రారంభించట్లేదన్నారు. రాజభవనం రోజురోజుకూ పెచ్చులూడుతూ ప్రమాదంగా మారిందని, విద్యార్థుల భవిష్యత్ దృష్టి ఉంచుకొని ప్రభుత్వం మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. వనపర్తిలో చదువుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమస్యను దృష్టిలో పెట్టుకొని అదనంగా రూ.15 కోట్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌పాషా, గంధం నాగరాజు, మిద్దె నాగేష్, శివకుమార్, రేవల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రూ.500 కే సిలిండర్



దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

అమరచింత: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల్లో ఒకటైన రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్‌కు దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల వివరాలతో ఇంటింటికీ వెళ్లి మరో మారు సర్వే చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తెలిపారు. పట్టణంలోని రెండో వార్డులో తమ సిబ్బందితో కలిసి గురువారం అర్జీదారుల పత్రాలతో ఇంటింటి సర్వే చేపట్టారు. ఆధార్ కార్డు నంబర్, గ్యాస్ సిలిండర్ బుక్ నంబర్లు సరిగా ఉన్నాయా.. లేవా అన్న విషయాలను తెలుసుకుంటున్నామన్నారు. వారం రోజుల పాటు పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి స్థాయిలో గ్యాస్ సిలిండర్ వినియోగదారుల వివరాలను నమోదు చేయడానికి తగు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఓ క్రిష్ణయ్య, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యం



సల్కెలాపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రజలంతా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సీనియర్ నాయకులు విక్రం, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. గురువారం మండలంలోని పర్వతాపురం, సల్కెలాపురం గ్రామాల్లో 'పల్లెకు పోదాం, ఇంటికి పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల బీజేపీ నాయకులు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు చేసి జమ్ముకశ్మీర్ ప్రజలకు శాంతి, ప్రగతిని అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, రవీంద్రాచారి, కొరిగెల గోపి, భద్రయ్య ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మండలానికి రూ.3.60 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ప్రకాష్, శ్రీరాములు, శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణ, జన్ను మధు, శంకర్, క్యామ రాజు పాల్గొన్నారు.